# సాక్షి
## శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం, 22, ఏప్రిల్, 2025




**చీనీ టన్ను రూ.23,800**

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.23,800 పలికాయి.



**బిందెడు నీటికి బండెడు కష్టాలు**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉన్న 727 గ్రామాల ప్రజల దాహార్తి తీర్చే శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోంది.

8లో






జిల్లా పరిధిలో సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం కొనసాగింది. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

## న్యూస్‌రీల్

### జిల్లా జడ్జిని కలిసిన కలెక్టర్



ప్రశాంతి నిలయం: అనంతపురంలోని జిల్లా కోర్టులో సోమవారం సాయంత్రం నూతన జిల్లా జడ్జిగా బాధ్యతలు స్వీకరించిన భీమారావును కలెక్టర్ టీఎస్ చేతన్ మర్యాద పూర్వకంగా కలిశారు. పూల మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు.

### తగ్గుతున్న చింత పండు ధరలు



మార్కెట్‌కు వచ్చిన చింత పండు

హిందూపురం అర్బన్: హిందూపురం వ్యవసాయ మార్కెట్‌లో గత మూడు వారాలుగా చింత పండు ధరలు పడిపోతున్నాయి. సోమవారం 881.70 క్వింటాళ్ల చింత పండు వచ్చింది. మార్కెట్‌లో ఈ నామ్ పద్ధతిలో వేలం పాటలు సాగాయి. కరిపులి రకం క్వింటా గరిష్ఠ ధర రూ.19,500, కనిష్ఠ ధర రూ.8 వేలు , సగటు ధర రూ.15 వేలు పలికింది. అలాగే ఫ్లవర్ రకం క్వింటా గరిష్ఠ ధర రూ.12,500, కనిష్ఠ ధర రూ.4,420, సగటు ధర రూ.8 వేలు పలికింది. గత వారంతో పోలిస్తే కరిపులి రకం క్వింటాపై రూ.1000 తగ్గుదల కనిపించింది. వాతావరణ మార్పులు, చల్లదనంతో ధరలు తగ్గుముఖం పట్టినట్లు మార్కెట్ కార్యదర్శి జి. చంద్రమౌళి తెలిపారు.

### దొంగతనం కేసులో ముద్దాయికి మూడేళ్ల జైలు



పుట్టపర్తి టౌన్: కొత్తచెరువులో జరిగిన రెండు దొంగతనాల కేసులో ముద్దాయి అమర్నాథ్‌నాయుడుకు మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ పుట్టపర్తి జేఎఫ్‌సీఎమ్ కోర్టు జడ్జి రాకేష్ సోమవారం తీర్పు వెల్లడించారు. కొత్తచెరువులో జరిగిన రెండు దొంగతనాలపై విచారణ జరిపి అమర్నాథనాయుడుపై 2012లో కేసును నమోదు చేసి విచారణ జరిపి రిమాండ్‌కు తరలించారు. ఏపీపీ మైలాబాబు, రాజేంద్రప్రసాద్ తమ వాదనలు వినిపించారు. వాదనలు విన్న జడ్జి రాకేష్ ముద్దాయిపై అభియోగాలు రుజువు కావడంతో మూడు సంవత్సరాలు జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధించారు.

# తమ్ముళ్ల మట్టి దందా



చిలమత్తూరు సమీపంలోని బైరేకుంట చెరువులో మట్టి తవ్వుతున్న దృశ్యం

హిందూపురం నియోజకవర్గంలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. సహజ వనరులను దోచేస్తూ అడ్డదిడ్డంగా సంపాదిస్తోంది. ముఖ్యంగా కొందరు టీడీపీ నాయకులు చెరువుల్లో మట్టిని యథేచ్ఛగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నేరుగా ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏల పేర్లతోనే దందా చేస్తుండటంతో అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

- బాలయ్య ఇలాకాలో రెచ్చిపోతున్న మట్టి మాఫియా
- నేరుగా ఎమ్మెల్యే పీఏలతో డీల్!
- బినామీలుగా టీడీపీ నాయకులు
- రియల్టర్ల నుంచి రోజువారీగా వసూళ్లు
- చోద్యం చూస్తున్న ఇరిగేషన్, మైనింగ్‌శాఖ అధికారులు

చిలమత్తూరు: బాలయ్య ఇలాకాలో దందాలు పెచ్చుమీరాయి. సినిమా షూటింగులతో బాలకృష్ణ బిజీగా ఉంటే.. ఆయన పీఏలతో పాటు అనుచర గణం నియోజకవర్గంలోని సహజ సంపదను దోచేసే పనిలో నిమగ్నమయ్యారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. నదులు, చెరువులలో మట్టి, ఇసుకను విచ్చలవిడిగా తరలిస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు. ఎవరైనా అడిగితే మాత్రం పీఏలు చెప్పారంటూ తమ అక్రమ వ్యాపారాలను సాగించేస్తున్నారు.

**మట్టి మాఫియాకు కేరాఫ్‌గా చిలమత్తూరు..**

రాష్ట్ర సరిహద్దు అయిన చిలమత్తూరు మండలం మట్టి మాఫియాకు కేంద్ర బిందువుగా మారింది. ఇక్కడ 44వ నంబరు జాతీయ రహదారి, గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే, 544ఈ జాతీయ రహదారి, పుట్టపర్తి వరకూ నాలుగు లేన్ల రహదారులు ఉండటంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూములు కొనుగోలు చేసి అగ్రి లేఔట్లను జోరుగా అభివృద్ధి చేసుకుంటున్నారు. అయితే భూములు ఎత్తుపల్లాలు ఉండటంతో వాటిని లెవలింగ్ చేసుకోవడానికి ఇష్టానుసారంగా మట్టిని చెరువుల నుంచి తరలిస్తున్నారు.

**నేరుగా పీఏలతోనే బేరం !**

రియల్టర్లు నేరుగా ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏలతోనే స్థానిక టీడీపీ నేతల ద్వారా టచ్‌లోకి వెళ్లిపోయి మట్టి దందాను సాగిస్తున్నారన్న విమర్శలున్నాయి. అభివృద్ధి మాట పక్కనపెట్టి వారి స్వలాభాలకే ప్రాధాన్యం ఇస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఇటీవల హిందూపురానికి చెందిన ఓ టీడీపీ నేత .. 44వ నంబరు జాతీయ రహదారి దగ్గర ఉన్న రియల్టర్‌కు చెందిన భూమి లెవలింగ్ కోసం వందలాది లోడ్ల మట్టిని అక్రమంగా లేపాక్షి నాలెడ్జి హబ్ భూముల నుంచి తరలించారు. ఇందుకోసం మండలస్థాయి టీడీపీ నేత అనుచరుడి అకౌంట్‌లోకి రోజుకు రూ.50 వేల చొప్పున రియల్టర్ చెల్లించినట్లు సమాచారం. ఇదంతా పురంలో ఉన్న ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏలకు చేర్చారన్న ఆరోపణలు బలంగా ఉన్నాయి.

**అన్నీ అధికారులకు తెలిసే..**

హిందూపురం నియోజకవర్గంలో మట్టి దందా విషయం ఇరిగేషన్ , మైనింగ్‌శాఖ అధికారులకు తెలిసినా ఏమీ చేయలేకపోతున్నారన్న విమర్శలున్నాయి. కేవలం పీఏల భయంతో మిన్నకుండిపోతున్నట్లు చెబుతున్నారు. మండలంలో కొడికొండ – మొరసలపల్లి ప్రధాన రహదారి పక్కనే ఇటుక బట్టీల కోసం ఓ టీడీపీ నేత వందలాది లోడ్ల మట్టిని డంప్ చేశారు. దీనికి ఎలాంటి అనుమతి లేదు. రైతులకు మట్టి తోలుకునేందుకు వంద నిబంధనలు పెట్టే అధికారులు ఇలాంటి అక్రమార్కులపై చర్యలు ఎందుకు తీసుకోరని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**కళావిహీనంగా నదులు..**

మట్టి దందాతో పాటు అక్రమంగా ఇసుక తరలింపు ద్వారా తమ్ముళ్ల ఆదాయం మూడు పువ్వులు, ఆరు కాయలుగా మారింది. నదుల్లోని సహజ వనరుల సొమ్మంతా టీడీపీ నేతల ఇళ్లకు చేరుతోంది. యథేచ్ఛగా ఇసుక దోపిడీ ద్వారా నదులన్నీ కళావిహీనంగా కనిపిస్తున్నాయి. నియోజకవర్గంలోని పెన్నా, చిత్రావతి, కుషావతి నదులు ఇసుక దిబ్బలతో నీటితో కళకళలాడేవి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అవి కళావిహీనంగా మారాయి. ఇసుక దోపిడీ కారణంగా వేసవిలో నదుల్లో ఉన్న నీరంతా ఆవిరైపోయింది. సహజ వనరులు ఇలాగే ఖాళీ చేస్తే కరువు సంభవించడం ఖాయమని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏలు స్థానికంగా ఉండే నేతలను బినామీలుగా అడ్డుపెట్టుకొని సహజ వనరులను దోచుకుంటూ నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా మార్చేందుకు కుట్ర చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నేతలు మండిపడుతున్నారు.



దేమకేతేపల్లి వద్ద ఇటుక బట్టీ కోసం మట్టిని డంప్ చేసిన దృశ్యం



కొడికొండ సమీపంలో ఇసుకను జేసీబీ ద్వారా లిఫ్ట్ చేస్తున్న దృశ్యం



తుమ్మలకుంట సమీపంలో లేపాక్షి హబ్ భూముల్లో మట్టి తవ్వకాలు

**కేసులు నమోదు చేస్తాం**

హిందూపురం నియోజకవర్గంలోని చెరువుల్లో మట్టిని కేవలం రైతులు పొలాల్లోకి తోలుకునేందుకు మాత్రమే అనుమతి ఇస్తున్నాం. ఇప్పటి వరకూ వెంచర్లు, కమర్షియల్ వ్యాపారులకు ఎక్కడా మట్టి తవ్వుకునేందుకు అనుమతులు ఇవ్వలేదు. ఎవరైనా మట్టి తవ్వకాలు చేపట్టినట్లు తమ దృష్టికి తీసుకొస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. కేసులు కూడా నమోదు చేస్తాం.

– యోగానంద, ఇరిగేషన్, డీఈ, హిందూపురం

# సమస్యల పరిష్కారమే ధ్యేయం

- కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన అర్జీలను అధికారులు శ్రద్ధతో పరిష్కరించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. పింఛన్లు, ఇంటి పట్టాలు, ఇల్లు, భూ సమస్యలు తదితర వాటిపై 304 ఫిర్యాదులు అందాయి. కలెక్టర్ చేతన్ మాట్లాడుతూ నిర్ణీత గడువులోపు నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలని అధికారులను ఆదేశించారు. లక్ష్యాలను సాధించడంలో ఏవైనా సమస్యలు ఉంటే విజయవాడలోని ఆయా శాఖల ఉన్నతాధికారులకు తెలియజేస్తే సమస్యలకు పరిష్కారం చూపిస్తారన్నారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీలోపు నమోదు డ్రైవ్ కార్యక్రమాన్ని ప్రారంభించాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటనల్లో ఇచ్చిన హామీల సమగ్ర నివేదికలు మంగళవారంలోపు సిద్ధం చేయాలన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ చేతన్

**అర్హులకే ఎస్సీ కార్పొరేషన్ రుణాలు..**

జిల్లాలో 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎస్సీ లబ్ధిదారులకు 604 యూనిట్లు పంపిణీ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో బ్యాంక్ అధికారులు, వివిధ శాఖల అధికారులతో కలసి డీసీసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రూ.25.14 కోట్ల విలువతో 604 యూనిట్లను ఎస్సీ లబ్ధిదారులకు అందించేందుకు ఆమోదం తెలిపామన్నారు. అర్హులకు మాత్రమే అవి అందేలా చూడాలన్నారు. రొద్దం, తనకల్లులను కరువు మండలాలుగా గుర్తించడం జరిగిందని పేర్కొన్నారు. ఆ రెండు మండలాల్లో రుణాలు రీ షెడ్యూల్ చేయాలని ఆదేశించారు.

**అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి..**

జిల్లాలోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమై పలు సూచనలు చేశారు. 2025–26లో జిల్లాలో మొత్తం 33,749 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు పేర్కొన్నారు. లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి చేయాలన్నారు. మే 5వ తేదీ నుంచి సెప్టెంబర్ వరకూ నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్‌ఓ విజయసారథి, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, అడల్ట్ ఎడ్యుకేషన్ డీడీ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# ధర్మవరంలో ముస్లింల భారీ ర్యాలీ



ధర్మవరం కాలేజ్ సర్కిల్ వద్ద నిర్వహించిన బహిరంగ సభకు భారీగా హాజరైన ముస్లింలు

- వక్ఫ్ సవరణ చట్టం రద్దు చేసే దాకా పోరాటం చేస్తామని ముస్లిం పెద్దల స్పష్టీకరణ

ధర్మవరం: వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకునే వరకూ పోరాటం చేస్తామని ముస్లిం నాయకులు స్పష్టం చేశారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలంటూ ధర్మవరం పట్టణంలో ముస్లింలు, సంయుక్త మస్జీద్ కమిటీల ఆధ్వర్యంలో సోమవారం భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. జామియా మస్జీద్ నుంచి పీఆర్‌టీ సర్కిల్, గాంధీ సర్కిల్ మీదుగా కళాజ్యోతి, కాలేజ్ సర్కిల్ వరకూ నిరసన ర్యాలీ చేపట్టారు. సీపీఐ, సీపీఎం, వైఎస్సార్‌సీపీ, క్రైస్తవ సంఘాలు, బీఎస్పీ, ఎమ్మార్పీఎస్, సీఐటీయూ, ఏఐటీయూసీ సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. అనంతరం కాలేజ్ సర్కిల్ వద్ద బహిరంగ సభను ఏర్పాటు చేశారు.

**రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తారా?**

ముస్లిం మతపెద్దలు తాహిర్ మౌలానా తాహిర్, తాయూబ్ మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు సవరణ చట్టం అమలు చేయడం ద్వారా వక్ఫ్ ఆస్తులకు రక్షణ లేకుండా పోతుందన్నారు. ఏళ్ల నాటి వక్ఫ్ ఆస్తులకు ఇప్పుడు రికార్డులను చూపించి హక్కులను పొందాలనడం సమంజసం కాదని తెలిపారు. వక్ఫ్ ఆస్తులతో రియల్ ఎస్టేట్ చేసేందుకు కొంత మంది స్వార్థ పరులు ప్రయత్నిస్తున్నారన్నారు. సవరణ చట్టంలోని లోపాలను సర్వోన్నత న్యాయస్థానం ఎత్తిచూపినా ఇంకా మొండి పట్టు పట్టడం మంచిది కాదన్నారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేసేవరకు ఆందోళనలు చేస్తామని అవసరమైతే ఆమరణ దీక్ష చేసేందుకు వెనుకాడబోమన్నారు.

**రాజకీయ లబ్ధికోసమే..**

కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని పరిహాసం చేసేవిధంగా నల్ల చట్టాలను తెచ్చి అమలు చేసేందుకు యత్నిస్తోందని సీపీఐ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ముసుగు మధు, సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు షేక్ చాంద్‌బాషా, కాంట్రాక్టర్ వలి, సాధిక్, పాస్టర్లు మోసేజ్ గ్రేసయ్య, సుందర్‌సింగ్ విమర్శించారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని కేవలం రాజకీయ లబ్ధికోసమే కేంద్రం ప్రవేశపెట్టిందన్నారు. ఇలాంటి చట్టాలకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మద్దతు తెలపడం దారుణమన్నారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

# మున్సిపల్ కార్యాలయంలో అవినీతి అనకొండ

☛ పుట్టపర్తి మున్సిపల్ కార్యాలయంలో పని చేసే ఓ మహిళా ఉద్యోగి ఆరోగ్యం బాగాలేక సెలవు కావాలని అడిగింది. అయితే సెలవు మంజూరు చేయాలంటే రూ.20 వేలు ఇస్తే.. ఇప్పటికిప్పుడే మంజూరు చేస్తామని ఉన్నతాధికారి డిమాండ్ చేశారు. దీంతో ఆ మహిళా ఉద్యోగి తనకు సెలవు అవసరం కావడంతో.. అప్పు చేసి మరీ రూ.15 వేలు ఇచ్చి.. మిగతా రూ.5 వేలు తర్వాత ఇస్తానని సెలవులో వెళ్లారు. అనంతరం మరో ఉద్యోగి సెలవు అడిగితే నాలుగు మద్యం బాటిళ్లు కావాలని డిమాండ్ చేయడంతో తప్పనిసరి పరిస్థితుల్లో గత్యంతరం లేక ముడుపులు చెల్లించినట్లు తెలిసింది.

☛ పుట్టపర్తిలోని శ్రీసత్యసాయి బాబా మందిరం గోపురం ఎదురుగా ఓ హోటల్ పన్ను బకాయి రూ.3 లక్షలు ఉందట. అయితే అవసరం ఉంది.. రూ.10 వేలు ఇస్తే.. పన్ను రూ.3 లక్షల గురించి ఆర్నెల్లు అడిగేది లేదని ఓ అధికారి వెళ్లి హోటల్ నిర్వాహకుడితో చర్చించాడు. అయితే సదరు నిర్వాహకుడు పన్ను మొత్తం కడతాను.. అయితే కట్టినట్లు రశీదు తప్పనిసరి అని చెప్పడంతో మిన్నకుండిపోయారు. తర్వాత మున్సిపల్ సిబ్బంది వెళ్లి రూములు ఎలా ఉన్నాయి.. ఫుడ్ ఎలా ఉందని ఇబ్బంది పెడుతున్నారని హోటల్ నిర్వాహకుడు వాపోతున్నాడు.

☛ బుక్కపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విలువ వేసిన ఓ షాపునకు సంబంధించి టైటిల్ మార్పు కోసం పుట్టపర్తి బస్టాండు సమీపంలోని ఓ దుకాణ నిర్వాహకుడు పుట్టపర్తి మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాడు. ఆస్తి విలువలో ఒక శాతం కమీషన్ ఇస్తే పని పూర్తవుతుందని అక్కడ ఓ ఉద్యోగి సమాధానం చెప్పడంతో షాక్ తిన్నాడు. కేవలం రూ.70 చలానా కడితే అయిపోయే పని కోసం రూ.12 వేలు ఖర్చు పెట్టుకోవాల్సిన కర్మ ఏంటని.. టైటిల్ మార్పు చేసుకోలేని స్థితిలో ఉన్నట్లు వివరించాడు.




- పుట్టపర్తి మున్సిపల్ కార్యాలయంలో చేయి తడిపితేనే సేవలు
- ప్రతి పనికీ రేటు ఫిక్స్ చేసిన ఉన్నతాధికారి

సాక్షి, పుట్టపర్తి: జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం అవినీతికి కేరాఫ్‌గా మారింది. ఓ ఉన్నతాధికారి ప్రతి పనికీ రేట్ ఫిక్స్ చేయడంతో ఆ కార్యాలయం గడప తొక్కాలంటేనే జనం బెంబేలెత్తిపోతున్నారు.

**పన్ను వసూళ్లలోనూ లాలూచీ**

పుట్టపర్తి మున్సిపాలిటీలో ఇంటి పన్ను రూ.కోట్లలో బకాయి ఉంది. వసూలు చేయలేని పరిస్థితి ఉందని అధికారులు చెబుతున్నారు. బకాయి ఎందుకు వసూలు చేయలేదని ఆరా తీస్తే.. పన్ను కట్టాల్సిన వారి నుంచి అంతో ఇంతో తీసుకుని అడక్కుండా వదిలేస్తున్నట్లు తెలిసింది. మరోవైపు మున్సిపాలిటీలో అధికారులకు ఏ పని కావాలన్నా.. పన్ను బకాయి ఉన్న వారి దగ్గరకు వెళ్లి డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. మాట వినని వ్యాపారులపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం.

**డబ్బిస్తే అక్రమ కట్టడాలకు ఓకే**

భవనాలు కట్టుకునేందుకు అనుమతులు కోరితే ఇచ్చే పరిస్థితి లేదు. అక్రమ మార్గంలో వెళ్లి.. కట్టలు ముట్టచెబితేనే ఎన్ని అంతస్తులు కట్టినా అడిగే పరిస్థితి కూడా లేదని అంటున్నారు. ఎవరికి ఎంత డబ్బు ఇచ్చినా.. భవనం కట్టిన తర్వాత అధికారులు మారితే.. వచ్చే కొత్త అధికారులతో సమస్య వస్తుందని.. కచ్చితమైన ఉత్తర్వులు అందజేయాలని, ఎంతైనా రశీదుల రూపంలో చలానా కడతామని విన్నవించినా పట్టించుకోవడం లేదంటున్నారు. ఇదే విషయంపై ఇద్దరు అధికారుల మధ్య మాటల యుద్ధం జరిగినట్లు తెలిసింది.

**రశీదులు ఇవ్వకుండా జరిమానా..**

ప్లాస్టిక్ నిషేధమంటూ చిన్నా చితకా హోటళ్ల దగ్గరకు వెళ్లి రూ.500 నుంచి వసూలు చేస్తున్నారు. రశీదు ఇవ్వండని అడిగితే కార్యాలయానికి వచ్చి కలవాలని చెబుతున్నారు. అక్కడికి వెళ్తే.. అసలు మీ హోటల్‌కు అనుమతులు ఉన్నాయా? పన్నులు కట్టారా? లాంటి ప్రశ్నలు వేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని వ్యాపారులు వాపోతున్నారు.

**ప్రతి పనికీ ఓ రేటు..**

మున్సిపాలిటీలో జనన, మరణ ధ్రువపత్రాల నుంచి పేరు మార్పు, అనుమతులు, పన్ను వసూలు.. ఆఖరుకు సెలవు మంజూరు విషయంలోనూ ప్రతి పనికీ ఓ రేటు ఫిక్స్ చేసి దండుకుంటున్నారన్న విమర్శలున్నాయి. ఓ మాజీ మంత్రి అండతో మున్సిపల్ కార్యాలయంలోని ఉన్నతాధికారి దందా చేస్తున్నారంటున్నారు.

# పాలబావిలో గంగ పూజ



అలంకరణలో కొల్హాపురి మహాలక్ష్మీదేవి



పాలబావిలో గంగ పూజలో నిమగ్నమైన మహిళలు

రొళ్ల: మండలంలోని రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం పాలబావిలో గంగ పూజ ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు తరలిరావడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పాలబావి వద్ద గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచారు. రత్నగిరి సంస్థాన రాజవంశీకుడు దొర రంగప్పరాజు, గ్రామ పెద్దలు, కై వాడస్తులు తదితరులు పర్యవేక్షించారు. కాగా, సోమవారం వేకుజాము నుంచి ఆలయంలో విశేష పూజలు పెద్ద ఎత్తున జరిగాయి. కాగా, కొల్హాపురి మహాలక్ష్మీదేవి బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ముగియనున్నట్లు దొర రంగప్పరాజు, గ్రామ పెద్దలు తెలిపారు.

## క్లుప్తంగా

### కర్ణాటక మద్యం పట్టివేత


మద్యాన్ని చూపుతున్న ఎక్సైజ్ సిబ్బంది

హిందూపురం టౌన్: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ముగ్గురిని సోమవారం అరెస్ట్ చేసి, 240 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య తెలిపారు. సోమవారం తనిఖీలు చేపట్టిన సమయంలో కర్ణాటక మద్యం అక్రమంగా తరలిస్తూ నంది సర్కిల్ వద్ద ఎక్సైజ్ సిబ్బందికి అంబేడ్కర్ నగర్‌కు చెందిన మారుతి, నారాయణ, రాజు పట్టుబడ్డారన్నారు. నిందితులపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు.

### గంజాయి విక్రేతల అరెస్ట్

బత్తలపల్లి: మండల కేంద్రంలో సోమవారం గంజాయి విక్రయిస్తూ ఇద్దరు పట్టుబడినట్లు ఎస్‌ఐ సోమశేఖర్ తెలిపారు. పట్టుబడిన వారిలో జ్వాలాపురం గ్రామానికి చెందిన లోక్‌నాథరెడ్డి, వెంకటరమణ ఉన్నారన్నారు. వీరిద్దరూ బత్తలపల్లిలోని తాడిపత్రి రోడ్డులో ఉన్న జగనన్న కాలనీ వద్ద గంజాయి విక్రయిస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా అరెస్ట్ చేసి, 190 గ్రాముల గంజాయిని స్వాధీని చేసుకున్నట్లు వివరించారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించామన్నారు.

# బిందెడు నీటికి బండెడు కష్టాలు

- కూటమి అధికారంలోకి వచ్చాక శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం నిర్వీర్యం
- వేతనాలు అందించలేని దుస్థితిలో 'బాబు' సర్కార్
- ఈ నెల 6 నుంచి సమ్మెలో కార్మికులు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 727 గ్రామాలకు నిలిచిన తాగునీటి సరఫరా


వ్యవసాయ బోరు వద్ద ట్యాంకర్లకు పడుతున్న తాగునీరు

రాయదుర్గం: ఉమ్మడి జిల్లాల్లోని రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ, హిందూపురం, మడకశిర నియోజకవర్గాల పరిధిలో ఉన్న 727 గ్రామాల ప్రజల దాహార్తి తీర్చే శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోంది. కూటమి సర్కార్ ఘోర వైఫల్యాల కారణంగా పల్లెలన్నీ గొంతెండుతున్నాయి. గుక్కెడు నీటి కోసం గ్రామస్తులు పొలాల వెంబడి పరుగు తీస్తున్నారు.

**16 రోజులుగా నిలిచిపోయిన తాగునీటి సరఫరా**

లక్షలాది మంది గొంతు తడిపే అతిపెద్ద శ్రీరామరెడ్డి తాగునీటి పథకాన్ని అధికారం చేపట్టి పట్టుమని పది నెలల కాకనే చంద్రబాబు సర్కార్ అటకెక్కించింది. నిర్వహణ చేతకాక చేతులెత్తేసింది. నెలల తరబడి జీతాలు చెల్లించకపోవడంతో 16 రోజులుగా కార్మికులు సమ్మె బాటపట్టారు. దీంతో తాగునీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. ఫలితంగా శ్రీరామరెడ్డి తాగునీటి పథకం లబ్ధి పొందుతున్న గ్రామాల్లో ప్రజలు కన్నీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు.

**వ్యవసాయ బోర్లే దిక్కు**

ఉమ్మడి జిల్లాల్లోని చాలా గ్రామాల్లో తాగునీటి కోసం ప్రజలు వ్యవసాయ బోర్లను ఆశ్రయిస్తున్నారు. విద్యుత్ సరఫరా ప్రారంభం కాగానే పొలాల్లోకి పరుగులు తీస్తున్నారు. రైతుల నుంచి ఎదురయ్యే ఛీత్కారాలను మౌనంగా భరిస్తూ తమ నీటి అవసరాలు తీర్చుకుంటున్నారు. నీటి కష్టాలు చూసిన ట్యాంకర్ల నిర్వాహకులు ధర అమాంతం పెంచేశారు. పట్టణాల్లో ఒక్కో ట్యాంకర్‌కు రూ.800 నుంచి రూ. వెయ్యి వరకు వసూలు చేస్తున్నారు. అది కూడా అర్ధరాత్రి సమయంలో ట్యాంకర్లు వస్తుండడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

**సమ్మె విరమిస్తేనే ప్రయోజనం**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో 800 మంది కార్మికులు పనిచేస్తుండగా కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చాక వివిధ కారణాలతో ఆ సంఖ్య 630కి కుదించారు. సూపర్‌వైజర్లు మరో 20 మంది ఉన్నారు. నిత్యం 47 ఎంఎల్‌డీ నీటిని ఉరవకొండ నియోజకవర్గం పీఏబీఆర్ పంప్‌హౌస్ నుంచి పంపింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో కార్మికులకు కొన్ని నెలలుగా జీతాలు చెల్లించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వచ్చింది. దీంతో కార్మికుల వేతన బకాయిలు రూ.8 కోట్లకు చేరుకుంది. పలు దఫాలుగా నిరసనలు వ్యక్తం చేసినా... చర్చల పేరుతో కార్మికులను మభ్య పెట్టారు తప్ప సమస్యకు పరిష్కారం చూపలేకపోయారు. దీంతో గత్యంతరం లేని స్థితిలో కార్మికులు సమ్మెలోకి వెళ్లారు. నిండు వేసవిలో 16 రోజులుగా తాగునీటి పథకం ద్వారా నీరందక పోవడంతో ప్రజల ఇక్కట్లు నానాటికీ జటిలమవుతున్నాయి. కార్మికులు సమ్మె విరమించి విధుల్లో చేరితేగాని సమస్యకు పరిష్కారం కనిపించడం లేదు.

**శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం వివరాలు**

| | |
|---|---|
| ఉమ్మడి జిల్లాలో తాగునీరందే గ్రామాలు | 727 |
| రోజూ సరఫరా చేసే నీటి సామర్థ్యం | 47 ఎంఎల్‌డీ |
| ఉమ్మడి జిల్లాలో మొత్తం కార్మికులు | 588 మంది |
| సూపర్‌వైజర్లు | 20 మంది |
| పేరుకు పోయిన జీతాల బకాయిలు | రూ.8 కోట్లు |


తోపుడు బండిపై నీటిని తెచ్చుకుంటున్న గ్రామస్తుడు

**ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం**


శ్రీరామిరెడ్డి పథకం తాగునీరే మాకు దిక్కు. ఊర్లో బోర్లలో నీరు ఉప్పుగా ఉంటున్నాయి. వాటిని తాగలేక పోతున్నాం. ఎండకాలంలో ఇంతటి కష్టం వస్తోందని అనుకోలేదు.
– మారెక్క, గోనబావి, గుమ్మఘట్ట మండలం

**రెండు రోజుల్లో పరిష్కారం**

కార్మికులతో చర్చలకు ఉన్నతాధికారులు సిద్ధమయ్యారు. సమస్యకు ఒకట్రెండు రోజుల్లో పరిష్కారం దక్కుతుంది. రూ.8 కోట్ల వేతన బకాయిలు చెల్లించేలా నివేదికలు సమర్పించారు. త్వరలో కార్మికుల ఖాతాల్లో వేతనాలు జమ అవుతాయి. లీకేజీలు తాత్కలికంగా అరికట్టేలా చర్యలు తీసుకుంటాం. కొత్త లైన్ ఏర్పాటుకు ప్రణాళికలు చేపట్టాం.
– శిరీష, శ్రీరామిరెడ్డి పథకం డీఈ, అనంతపురం

**ఇబ్బందులు పడుతున్నాం**


మా గ్రామానికి శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం ఒక్కటే ఆధారం. సిబ్బంది సమ్మెలో వెళ్లినప్పటి నుంచి నీళ్లు రావడం లేదు. తాగునీళ్లతో పాటు ఇతర అవసరాలకు చాలా ఇబ్బందులు పడుతున్నాం. గ్రామంలో నీటి సమస్య తీవ్రంగా ఉన్నా అధికారులెవరూ పట్టించుకోవడం లేదు.
– నూర్జహాన్‌బీ, సొల్లాపురం, కణేకల్లు మండలం

**కుస్తీ పట్టాల్సి వస్తోంది**


ట్యాంకర్ ఊళ్లోకి వస్తే జనమంతా ఒక్కసారిగా చుట్టుముడుతున్నారు. నీళ్ల కోసం కుస్తీలు పట్టాల్సి వస్తోంది. ఇంత కష్టపడినా నీళ్లు అరకొరగా దొరుకుతాయి. వచ్చే సోమవారం ఊళ్లో రామాలయం ప్రారంభం ఉంది. ఈ వేడుకకు చుట్టాలను ఆహ్వానించాం. నీళ్ల కోసం ఎన్ని తిప్పలు పడాలో అర్థం కావడం లేదు.
– పద్మజ, సొల్లాపురం, కణేకల్లు మండలం

**పట్టించుకోవడం లేదు**


16 రోజులుగా శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా ఆగిపోయింది. బిందెడు నీటి కోసం ఇంతటి దౌర్భాగ్యం ఎదుర్కొవాల్సి వస్తోందని కలలో కూడా అనుకోలేదు. ప్రతి గ్లాస్ నీటిని పొదుపుగా వాడుకోవాల్సి వస్తోంది.
– జయమ్మ, గోవిందవాడ, బొమ్మనహాళ్ మండలం


సొల్లాపురంలో అర్ధరాత్రి ట్యాంకర్ ద్వారా నీటిని పట్టుకుంటున్న దృశ్యం

## డ్రిప్ మంజూరులో జిల్లాకు నాలుగో స్థానం


మాట్లాడుతున్న పీడీ వెంకటేశ్వర్లు

అనంతపురం సెంట్రల్: డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరులో రాష్ట్రంలో అనంతపురం జిల్లా మొదటి స్థానం, జాతీయ స్థాయిలో రెండో స్థానంలో నిలిచిందని ఏపీఎంఐపీ రాష్ట్ర ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం నగరంలో ప్రాంతీయ ఉద్యాన శిక్షణా సంస్థ కార్యాలయంలో మైక్రో ఇరిగేషన్ ఇంజినీర్లు, కంపెనీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. అధికారుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీసత్యసాయి జిల్లా రాష్ట్రంలో నాలుగు, జాతీయ స్థాయిలో ఐదో స్థానంలో ఉందని అభినందించారు. రైతుల పొలాల్లో పరికరాలను త్వరితగతిన అమర్చి సకాలంలో పంటలు సాగు చేసుకునేందుకు సహకరించాలని సూచించారు. ఎస్సీ,ఎస్టీ రైతులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వంద శాతం రైతులు డ్రిప్ వాడేలా చూడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ అనంతపురం జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్లు రఘునాథరెడ్డి, సత్యసాయి జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్, ఏపీఎంఐపీ ఇంజనీర్లు పాల్గొన్నారు.

## ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడి మృతి


రవికుమార్ (ఫైల్)

పరిగి: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... పరిగి మండలంవిట్టాపల్లికి చెందిన రవికుమార్ (33).. రొద్దం మండలం ఎం.కొత్తపల్లిలోని అత్తారింటికి వెళ్లాడు. ఆదివారం సాయంత్రం తిరిగి తనస్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరిన ఆయన.. పైడేటి సమీపంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ సమీపంలోకి చేరుకోగానే నియంత్రణ కోల్పోవడంతో వాహనం అదుపు కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం ఉదయం అటుగా వెళ్లిన స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

- ఎస్టీయూ నాయకుల డిమాండ్


డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న ఎస్టీయూ నాయకులు

పుట్టపర్తి అర్బన్: జిల్లా వ్యాప్తంగా పని చేస్తున్న 2008 డీఎస్సీ ఉపాధ్యాయుల నియామక తేదీని అందరికీ ఒకేలా ఉండేలా చూడాలని ఎస్టీయూ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు డీఈఓ కృష్ణప్పను సోమవారం కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాదరెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. 2008 డీఎస్సీ ఉపాధ్యాయులకు నియామక పత్రాలను 2010, నవంబర్ 6న ఇచ్చారన్నారు. అయితే కొందరు ఎంఈఓలు నవంబర్ 4, 5, 8 తేదీల్లో జాయినింగ్ డేట్ ఇవ్వడంతో ట్రాన్స్‌ఫర్ సీనియారిటీలో మెరిట్ ఉపాధ్యాయులకు నష్టం వాటిల్లుతోందన్నారు. దీంతో 2008 డీఎస్సీ ఉపాధ్యాయులకు కామన్ జాయినింగ్ తేదీని ఇవ్వాలన్నారు. అలాగే 2009లో పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు సైతం జాయినింగ్ తేదీల సమస్యలు నెలకొన్నాయని, వీటిని కూడా పరిష్కరించాలన్నారు. ఎల్ఎఫ్ఎల్ టూల్ ఇండక్షన్ ట్రైనింగ్, పదోతరగతి స్పాట్ వాల్యూయేషన్ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా కార్యదర్శి రవిచంద్ర, వెంగమనాయుడు, పుట్టపర్తి, బుక్కపట్నం, కొత్తచెరువు మండలాల అధ్యక్షులు శివయ్య, శ్రీనివాసులు, శంకర్ నాయుడు, షెక్షావలి, సురేష్, కృష్ణప్ప, అనిల్‌కుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## 'పురం' వాసికి గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు


వరల్డ్ రికార్డు పత్రాన్ని చూపుతున్న ఇమ్మానుయేల్ రాజ్

హిందూపురం: స్థానిక మిషన్ కాంపౌండ్ పాస్టర్ రెవరెండ్ డాక్టర్ స్టీఫెన్‌రాజ్ కుమారుడు పి.ఇమ్మానుయేల్ రాజ్‌కు గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. 2024, డిసెంబర్ 1న గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు కోసం హల్లెల్ మ్యూజిక్ స్కూల్ ఆధ్వర్యంలో 1,046 మంది సంగీత కళాకారులు కీబోర్డు వాయించి ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేశారు. దీనిని రికార్డుగా గుర్తిస్తూ ఇటీవల హైదరాబాదులో జరిగిన కార్యక్రమంలో ఇమ్మానుయేల్ రాజుకు సర్టిఫికెట్, గోల్డ్ మెడల్‌ను గిన్నిస్ వరల్డ్ రికార్డు ప్రతినిధులు అందజేశారు.

## లేని భూమిని విక్రయించారు

- న్యాయం చేయాలంటూ బాధితుడి వేడుకోలు
- ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 70 వినతులు


బాధితుడు రవీంద్రనాథ్

పుట్టపర్తి టౌన్: భూమి లేకున్నా... రికార్డుల్లో ఉన్నట్లు చూపించి తనకు విక్రయించి మోసం చేశారని, దీనిపై తనకు న్యాయం చేయాలటూ డీఎస్పీ ఆదినారాయణకు బాధితుడు రవీంద్రనాథ్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీని అందజేసి తన గోడు వెళ్లబోసుకున్నాడు. హిందూపురం సమీపంలోని మోతుకపల్లి రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 67–3లో ఉన్న మూడు ఎకరాల భూమిలో ఒక ఎకరా విస్తీర్ణాన్ని అదే గ్రామానికి చెందిన బోయ తిమ్మయ్య 2023లో హిందూపురానికి చెందిన రవీంద్రనాథ్‌కు రూ..20లక్షలకు విక్రయించేలా రూ. 3 లక్షల టోకన్ అడ్వాన్స్‌తో ఇచ్చి అగ్రిమెంట్ చేయించుకున్నాడు. ఈ నేపథ్యంలో రవీంద్రనాథ్‌కు ఇప్పటి వరకూ భూమిని చూపలేదు. ఈ రోజు.. రేపు అంటూ కాలయాపన చేస్తూ వచ్చాడు. దీంతో అనుమానం వచ్చిన రవీంద్రనాథ్ లోతుగా విచారణ చేయడంతో సదరు సర్వే నంబర్‌లో భూమి లేదని, మొత్తం మూడు ఎకరాలను ఇతరులకు విక్రయించినట్లుగా నిర్ధారణ కావడంతో తాను చెల్లించిన అడ్వాన్స్ వెనక్కు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఈ విషయంగా ఇద్దరి మధ్య వాగ్వాదం చేసుకోవడంతో రవీంనాథ్‌పై తిమ్మయ్య వర్గీయులు దాడిచేశారు. ఘటనపై హిందూపురం ఒకటో పట్టణ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. దీనిపై న్యాయం చేకూరకపోవడంతో సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ అందజేశారు. దీనిపై స్పందించిన డీఎస్పీ ఆదినారాయణ... వెంటనే హిందూపురం డీఎస్పీ మహేష్‌తో ఫోన్‌లో మాట్లాడారు. సమస్య వివరించి, పరిష్కారానికి చొరవ తీసుకోవాలని సూచించారు.


అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ రత్న

**ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలి..**

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందజేసే ఫిర్యాదులపై సత్వరమే స్పందించి సరైన పరిష్కారం చూపాలని పోలీసు అధికారులను ఎస్పీ రత్న ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 70 వినతులు అందాయి. ఎస్పీ రత్న స్వయంగా వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని చట్టపరిధిలోని అంశాలకు తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీలు ఆదినారాయణ, విజయకుమార్, లీగల్ అడ్వైజర్ సాయినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

## గాలీవాన బీభత్సం


నాగసముద్రం వద్ద విరిగి పడిన అరటి చెట్లు


రాలిన మామిడి కాయలను చూపుతున్న రైతు ముత్యాలప్ప


నేల వాలిన వరిపంటను చూపుతున్న రైతు వెంకటేష్

చెన్నేకొత్తపల్లి: మండలంలో పులేటిపల్లి, కోటంపల్లి, వెంకటంపల్లి, నాగసముద్రం, పైలబోయలపల్లి గ్రామాల్లో ఆదివారం రాత్రి గాలీవాన బీభత్సం సృష్టించింది. సాయంత్రం చిన్నగా వీచిన గాలి తర్వాత పెను రూపం దాల్చింది. దీనికి తోడు వర్షం కురిసింది. నాగసముద్రం గ్రామానికి రైతు లక్ష్మీనారాయణ, ఓబులేసు, పులేటిపల్లికి చెందిన కృష్ణమ్మ, మాధవరెడ్డి, పైలబోయలపల్లికి చెందిన వెంకటేశ్వరరెడ్డి అరటి తోటల్లో చెట్లు విరిగి పడ్డాయి. వెంకటంపల్లికి చెందిన హనుమంతరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి సాగు చేసిన దోస పంటలో కాయలు నిట్టనిలువునా పగిలాయి. నాగసముద్రం గ్రామానికి చెందిన ఓబులేసు, రామాంజినేయులు, పులేటిపల్లికి చెందిన లక్ష్మన్న, వెంకటంపల్లికి చెందిన కురబ చిన్నముత్యాలప్ప, నాగిరెడ్డి, గోవిందరెడ్డి మామిడి తోటల్లో టన్నుల కొద్ది కాయలు నేల రాలాయి. కోటంపల్లికి చెందిన లక్ష్మీదేవి మామిడి తోటలో కాయలు నేలరాలడంతో పాటు పది చెట్లు కూకటి వేర్లతో సహా నేలవాలాయి. ప్రస్తుతం మామిడి కాయలు టన్ను రూ.70వేల నుంచి రూ.90 వేల ధర పలుకుతున్నాయని బాధిత రైతులు తెలిపారు. పులేటిపల్లికి చెందిన రైతు వెంకటేష్ సాగు చేసిన వరి పంట నేలవాలి రూ.40 వేల మేర నష్టం వాటిల్లింది. గాలికి చెట్ల కొమ్మలు విరిగి కరెంటు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లపై పడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పులేటిపల్లి, వెంకటంపల్లి గ్రామాల మధ్య చెట్ల కొమ్మలు విరిగి రోడ్డుకు అడ్డంగా పడ్డాయి.

## ఒంగోలు నివాసి మృతి


మృతుడు కోటేశ్వరరావు

కదిరి టౌన్: స్థానిక తాయి గ్రాండ్ లాడ్జ్ మెట్లు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడిన ఒంగోలుకు చెందిన కోటేశ్వరరావు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఒంగోలుకు చెందిన శ్రీనివాసులు తన కారు డ్రైవర్ కోటేశ్వరరావుతో కలసి అనంతపురంలో బంధువుల ఇంట జరిగిన శుభకార్యానికి వచ్చారు. ఈ క్రమంలో కదిరిలోని తన స్నేహితుడు రమణను మాట్లాడేందుకు సోమవారం సాయంత్రం వచ్చి తాయిగ్రాండ్ లాడ్జిలో గదిని అద్దెకు తీసుకున్నాడు. టిఫెన్ కోసం వచ్చిన కోటేశ్వరరావు తిరిగి లాడ్జ్ మెట్లు ఎక్కుతుండగా అదుపు తప్పి కిందపడడంతో తలకు బలమైన గాయమైంది. కదిరి ఏరియా ఆస్పత్రిలో చికిత్స నిర్వహిస్తుండగా పరిస్థితి విషమించి ఆయన మృతి చెందాడు. ఘటనపై కదిరి పోలీసులు కేసు నమోదు చేశారు.

## కానిస్టేబుల్‌పై దాడి

ధర్మవరం అర్బన్: విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌పై ఐదుగురు యువకులు దాడికి పాల్పడ్డారు. ధర్మవరం రెండో పట్టణ సీఐ రెడ్డప్ప తెలిపిన మేరకు.. ఆదివారం రాత్రి 10.30 గంటలకు బీట్‌లో భాగంగా స్థానిక కదిరి గేటు వద్దకు కానిస్టేబుల్ విశ్వనాథ్ వెళ్లారు. ఆ సమయంలో అక్కడ రాజు అనే వ్యక్తి ఎగ్‌రైస్ బండి నిర్వహిస్తుండడం గమనించి, సమయం మించి పోయిందని, వ్యాపారాన్ని ఆపి ఇంటికెళ్లాలని సూచించారు. దీంతో రాజు వాగ్వాదానికి దిగాడు. ఎంత సర్ది చెప్పినా వినకుండా తన స్నేహితులను పిలిపించుకుని కానిస్టేబుల్ విశ్వనాథ్‌పై దాడికి పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు రాజు, అతని స్నేహితులు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## వ్యక్తి ఆత్మహత్య

- 20 రోజుల తర్వాత వెలుగు చూసిన ఘటన


శివారెడ్డి(ఫైల్)

బత్తలపల్లి: మండలంలోని యర్రాయపల్లి ఓబులేసుని కొండలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఓ వ్యక్తి మృతదేహాన్ని గొర్రెల కాపరులు సోమవారం గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహం కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. లభ్యమైన ఆధారాలను బట్టి మృతుడిని తాడిమర్రి మండలం పూలఓబయ్యపల్లికి చెందిన శెట్టిపల్లి శివారెడ్డి(43)గా గుర్తించారు. విషయాన్ని తెలుసుకున్న కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని పరిశీలించి మృతుడిని శివారెడ్డిగా నిర్ధారించి, బోరున విలపించారు. ధర్మవరం ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న ఓ ఫర్టిలైజర్ షాపులో పని చేస్తున్నట్లు తెలిపారు. ఉగాది పండుగ నుంచి కనిపించకుండా పోయాడని.. ఘటనపై అప్పట్లోనే ధర్మవరం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. కాగా, ఆయన ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## యువకుడి దుర్మరణం


మృతుడు సాయితేజ

చెన్నేకొత్తపల్లి: ద్విచక్ర వాహనాలు కారు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు.. రామగిరి మండలం శ్రీహరిపురం గ్రామానికి చెందిన సాయితేజ (24) సోమవారం ఉదయం ద్విచక్ర వాహనంపై ధర్మవరానికి బయలుదేరాడు. ప్యాదిండి గ్రామానికి అదే గ్రామానికి చెందిన రమేష్ మరో ద్విచక్ర వాహనంపై ధర్మవరానికి వెళుతూ సాయితేజ వాహనం వెనుకనే అనుసరించసాగాడు. ఈ క్రమంలో గ్రామ శివారులోకి చేరుకోగానే ధర్మవరం వైపు నుంచి ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన కారు తొలుత సాయితేజ ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని, తర్వాత వెనుకనే ఉన్న రమేష్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఘటనలో సాయితేజ అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన రమేష్‌ను స్థానికులు ధర్మవరంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. ఘటనపై సీకే పల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.


సాక్షి ఉద్యోగ అవకాశాలు
ప్రతి మంగళ, శుక్రవారములలో

**SRI VENKATESWARA INSTITUTE OF TECHNOLOGY - ANANTAPUR**
(APPROVED BY A.I.C.T.E & AFFILIATED TO JNTUA, ANANTAPURAM)
NH-44, HAMPAPURAM [V], RAPTHADU [M], ANANTAPURAM-515722
NAAC ACCREDITED
Email : hr@svitatp.ac.in Contact: 8977706730, 9676832619

**WANTED FACULTY**
Applications are invited from eligible candidates for the faculty positions in the following departments

| COURSE | DEPARTMENT | FACULTY POSITIONS |
|---|---|---|
| B.Tech | CSE, CSM,CSD,ECE, MECH, EEE, CIVIL, CHEMISTRY, PHYSICS, MATHEMATICS , ENGLISH & PHYSICAL DIRECTORS | PROFESSORS/ ASSOCIATE PROFESSORS/ ASSISTANT PROFESSORS |
| M.Tech | CSE, CSE(AI&ML) ECE(VLSI & EMBEDDED SYSTEMS), MECH (PRODUCTION ENGINEERING), EEE (ELECTRICAL POWER SYSTEMS) | PROFESSORS/ ASSOCIATE PROFESSORS/ ASSISTANT PROFESSORS |
| | NON TEACHING | ATTENDERS, TELE CALLERS |

Application should be sent to the Email : hr@svitatp.ac.in
Qualification & salary as per AICTE norms
- Principal

**సాక్షి క్లాసిఫైడ్స్**

**EDUCATION**

**B.TECH ADMISSIONS**

■ ఇంటర్‌లో M.P.C పాస్ + AP EAPCET క్వాలిఫైడ్ స్టూడెంట్స్‌కి B.Tech. (Any Branch) నందు ఫ్రీ ఎడ్యుకేషన్, కాలేజ్ క్యాంపస్‌లో ఫ్రీ హాస్టల్ కలదు. Cont:- G.MURALI, 9030661651 – అనంతపురం. [A-1583]

**SERVICES**

**బంగారం కొనబడును**

■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647. [V-6715]

**WANTED**

■ Wanted Experience Civil Engineers & Supervisors in Building constructions experience candidates for well Established Company Anantapur. Cont: 9000677088. [A-3939]

■ అనంతపురంలోని ప్రైవేట్ జూనియర్ కాలేజీలో పనిచేయుటకు PRO's, టెలికాలర్స్, Experience ఉన్న Administrators కావలెను. Cell: 9866117303, 9908829351. [A-66]

■ మీ ఇంటివద్దనే వుంటూ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం: 25-30వేలు వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్: 95504 67459. [SCA 25002811]

■ బ్యాంకులలో పర్మినెంట్ జాబ్స్: కం॥ ఆపరేటర్స్, క్లర్క్స్, అటెండర్స్, అసిస్టెంట్స్, రికవరీ, క్యాషియర్స్, క్యాష్ లోడింగ్, 10th-PG, జీ : 25000/- ✆ 8341098700 [G-9770]

■ అర్జెంటుగా కావలెను. ESM సెక్యూరిటీ సూపర్‌వైజర్. BPCL గుత్తి, అనంతపురం (AP), R.త్యాగరాజన్ సెక్యూరిటీ ఏజెన్సీ, ఖాళీలు: 01, నికర జీతం (26 రోజులు): రూ. 26,366/- EPF: రూ.3750/-. సంప్రదించండి: శ్రీ గజేంద్ర పంత్రి, మొబైల్ : 7415864502/ 9301165831 [DA-1512]

■ తాడిపత్రి హాస్పిటల్‌లో పని చేయుటకు క్వాలిఫైడ్ ఫార్మసిస్ట్ & నర్సులు కావలెను. సంప్రదించండి సెల్ : 7416964894 [SCA25002869]

■ ఉద్యోగ అవకాశం: హోమ్ అప్లయన్స్, జిల్లా వ్యాప్తంగా మార్కెటింగ్ కొరకు, అనుభవం కలిగిన సేల్స్ ఎగ్జిక్యూటివ్ కావలెను. మంచి జీతం + TA, DA ఇవ్వబడును. సంప్ర: 9000786886, శ్రీ విష్ణు ఎంటర్ ప్రైజెస్, ATP. [A-1584]

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ BELL INFRA ప్రాజెక్ట్ కొరకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. టార్గెట్స్‌తో సంబంధం లేకుండా ఖచ్చితమైన జీతం + ఇన్సెంటివ్స్ కలవు. శేఖర్: 9676294227, సురేష్ : 8919289902. [A-1585]

■ Career Abhimanya ఎడ్యుకేషనల్ సర్వీసెస్, అనంతపురం నందు పని చేయుటకు టెలికాలర్స్, రిసెప్షనిస్ట్ కావలెను. శాలరీ 12k-15k, మరిన్ని వివరాల కోసం: 9515151834, 8686181839. [A-1581]

■ WANTED TEACHERS: SHREE SHALA International school, Pavagada, Karnataka. Required Teaching Staff for Baby Sitting to Grade 10. Contact: 9448074422, 9448950770, 9902260389. infosreeshala@gmail.com [A-1582]

■ త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చంటి పిల్లలను చూసుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్. జీ : 18K. Ph: 8520980099, 8520874499 [SCA25002806]

■ ప్రముఖ హోంకేర్ సంస్థ Hydలో వృద్ధులకు, పేషెంట్లకు సేవచేయుటకు బేబికేర్, ఇంటి/వంట పనికి స్త్రీ/పు కావలెను. జీ : 18,000 - 24,000. రూం+మీల్స్ ఫ్రీ. 9347148051 [SCA25002878]

■ Wanted for High school Exp & Qua: IIT Phy & Maths, Social (30 to 35 K) Computer Electronics (15K) with food & accom. Preprimary Trs (10K) Back ground E,M.St. Antony's High School, Porumamilla, Kdp (dt). 9319979999. [C-1272359]

ప్రకటన గోరంత ! స్పందన కొండంత !!
4 లైన్లు రూ. 270/-
అదనపు లైను రూ. 60/-
ప్రతి 3 ప్రకటనలకు 1 ప్రకటన ఉచితం
ANANTHAPURAMU : 9010567770, 9492288307
DHARMAVARAM & PUTTAPARTHI : 9912220726, 7093150088
HINDUPUR & MADAKASIRA : 9912220723
GUNTAKAL & TADIPATRI : 9912220722
KADIRI : 7093150088
RAYADURG : 9010470185

**గమనిక**
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.